# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

## MARCH - 2016

సంవత్సర చందా రూ. 50/-

## టి.వి ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

**సత్యవాణి :**

ఆదివారం సాయంత్రం : 6.00 గంటలకు శుభవార్త

బుధవారం సాయంత్రం :6:30 గంటలకు రక్షణ

గురువారం మధ్యాహ్నం : 2:30 గంటలకు రక్షణ

ప్రతి ఆదివారం ఉదయం :7:00 గం॥ మనకాపరి టి.వి (తెనాలిగుంటూరు ఏరియాలో)

ప్రసంగీకులు :**జాషువ గూటం**

**రిక్కీ గూటం**

**రోని గూటం**

పై కార్యక్రమములను టి.విలో చూడండి.
మీ బంధు మిత్రులను కూడ ప్రోత్సహించండి.
ఉచిత బైబిలు కోర్సుకొరకు మాకు ఈరోజే వ్రాయండి.

**SATYA VANI**
**P.O.BOX.80, KAKINADA**
**Pin : 533004, Ph : 0884 -2363722**
**98489 98547, www.satyavanicoc.com**

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**



P.O. Box-80, Kakinada, A.P. 533 004

Ph : 0884 - 2363722, 98489 98547

Editor :

**JOSHUA GOOTAM**



Pleading for Restoration of First Century Christianity

| సంపుటి-36 | మార్చి - 2016 | సంచిక 8 |
|---|---|---|


## మార్గము, సత్యము, జీవము

### The Way, the Truth and the Life

"మీ హృదయమును కలవర పడనియ్యకుడి; దేవుని యందు విశ్వాసముంచు చున్నారు. నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రియింట అనేక నివాసములు కలవు, లేని యెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును. నేను వెళ్ళుచున్న స్థలమునకు మార్గము మీకు తెలియునని" యేసుప్రభువు తన శిష్యులతో చెప్పెను. "అందుకు తోమా - ప్రభువా, యెక్కడికి వెళ్ళుచున్నావో మాకు తెలియదే; ఆమార్గమేలాగు తెలియునని ఆయన నడుగగా యేసు -నేనే మార్గమును, సత్యమును, జీవమును; నాద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని చెప్పెను (యోహాను 14:1-6). యేసు చెప్పిన మార్గము, సత్యము, జీవములను గూర్చి ఈరోజు కొంత తెలిసి కొందుము.

మార్గమును గూర్చి బైబిలులో మనకు ఎక్కువ కన్పించుచున్నది. యేసు ఒకసారి యిట్లు చెప్పెను: "ఇరుకు ద్వారమున ప్రవేశించుడి నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆదారి విశాలమునై యున్నది. దానిద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును, ఆదారి సంకుచితమునై యున్నది" (మత్తయి 7:13,14).

యేసను మార్గము గనుక మోక్షమునకు చేరుటకు క్రీస్తు సంఘసభ్యులైయుండ నవసరము లేదని కొందరు అనుకొనుచున్నారు. అయితే అట్టివారు మార్గమును గూర్చి బైబిలు చెప్పుదానిని ఎరుగకయున్నారు. లేఖనముల నెరుగక వారు పొరబడు చున్నారు (మత్తయి 22:29).

క్రీస్తు యొక్క శరీరమైన సంఘములో లేకుండ క్రీస్తు యొక్క మార్గములో ఎవడును ఉండనేరడు. "ఈ మార్గములో నున్న పురుషులను స్త్రీలను బంధించి చెరసాలలో వేయించుచు మరణము వరకు హింసించితిని'' యని పౌలు సాక్ష్యమిచ్చెను. (అపొ.కా.22:4). ఈ మార్గము అనగా క్రీస్తు సంఘమని అతని ఉద్దేశ్యము. అయితే పౌలు క్రైస్తవుడయిన తరువాత అతడు హింసించిన మార్గమును గూర్చిన సత్యమును ప్రకటింప నారంభించెను. అతడు యూదుల సమాజ మందిరములోనికి వెళ్ళి ప్రసంగించుచు దేవుని రాజ్యమును గూర్చి తర్కించుచు, ఒప్పించుచుండెను (అపొ.కా.19:8). "అయితే కొందరు కఠిన పరచబడినవారై యొప్పుకొనక, జనసమూహము ఎదుట ఈ మార్గమును దూషించుచున్నందున అతడు వారిని విడిచివెళ్ళెను" అని అపొ.కా. 19:9లో వ్రాయబడి యున్నది. ఇక్కడ క్రీస్తు రాజ్యము, మార్గము అను పదములు సరిసమానముగ వాడబడినవి.

మనము చూచిన ఈ లేఖనములను బట్టి మార్గము, సంఘము, దేవుని రాజ్యము అనునవి ఒకే ఒక్కదానిని సూచించుచున్నవని గ్రహించవలెను. ఒకడు ప్రభువు గృహమైన ఆయన సంఘములో లేకుండ ఆయన మార్గములో యుండలేడు. ఆయన సంఘము ఒక డినామినేషన్ కాదు. ఆయన ఒకే ఒక్క సంఘమును స్థాపించెను. ఆ ఒకే సంఘమును గూర్చియే బైబిలు బోధించుచున్నది.

క్రీస్తు ద్వారా తప్ప మరొక విధముగ యెవడును తండ్రి యొద్దకు రాలేడు. క్రీస్తుద్వారా మనము వెళ్లవలెననిన ఆయన అధికారమునకు లోబడి యుండవలెను. అయితే ఆయన సువార్తకు లోబడకుండ యెవడును ఆయన అధికారమునకు లోబడలేడు. ఒకడు సువార్త విని, విశ్వసించి, తన పాపముల విషయమై మారు మనస్సు పొంది, క్రీస్తు లోనికిని, ఆయన సంఘములోనికిని బాప్తిస్మము పొందవలెను. ఒకడు సువార్తకు లోబడేవరకు కూడ ఆమార్గములో యుండలేడు (మార్కు 16:16,

అపొ.కా. 2:38). క్రీస్తు సంఘమై యున్న మార్గము విశాలమైనదికాదు అది ఇరుకైనది. అందులో మనుష్యులు తమ కిష్టము వచ్చినట్లు, తమకు తోచినట్లు ఆరాధించునది కాదు గాని ఆ మార్గములో అందరు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింతురు. తండ్రియైన దేవుడు కుమారుడైన క్రీస్తు ఎట్లు ఏకమై యున్నారో అట్లే అమార్గములో అందరు ఏకమై యుందురు (యోహాను 17:17-23).

యేసు నేనే మార్గము, సత్యము, జీవమునై యున్నానని చెప్పెను. సత్యమును గూర్చి కూడ బైబిలు ఎక్కువ బోధించుచున్నది. యేసు కృపా సత్య సంపూర్ణుడు గనుక నేనే సత్యము అని ఆయన చెప్పగలిగెను (యోహాను 1:14).

ఆయన సత్యవాక్యమును, అనగా రక్షణ సువార్తను మనకు అనుగ్రహించెను (ఎఫెసీ 1:13). ఆయన సత్యమునే జీవించెను. దేవుని వాక్యమే సత్యము (యోహాను 17:17) ఆయనే సత్యము.

దేవుని వాక్యమే సత్యము. రక్షణ సువార్తయే సత్యము (రోమా 1:16). అందువలన సత్యవర్తనుడు తన క్రియలు దేవుని మూలముగా చేయబడి యున్నవని ప్రత్యక్ష పరచబడునట్లు వెలుగునొద్దకు వచ్చును అని యేసు యోహాను 3:21లో చెప్పెను. ఇంకొక మాటలో సువార్తకు లోబడువారు వెలుగు నొద్దకు వత్తురు. అంటే వెలుగైన క్రీస్తు నొద్దకు వత్తురు.

అపొ. పేతురు దేవుని ప్రజల కిట్లు బోధించెను: "మీరు సత్యమునకు విధేయులవుటచేత మీమనస్సులను పవిత్రపరచు కొనినవారై యుండి, యొకనికొకడు హృదయపూర్వకము గాను, మిక్కుటముగాను ప్రేమించుడి" (1 పేతురు 1:23). వారు బాప్తిస్మము ద్వారా రక్షింపబడినారని పేతురు వారికి బోధించెను (1 పేతురు 3:21; అపొ.కా 2:38). గనుక ప్రజలు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినపుడు క్రీస్తు రక్తముచేత తమ ఆత్మలను పవిత్ర పరచుకొందురు.

పరిశుద్ధ ఆత్మావేశము గల వారి వలన మనకు సత్యము ఈయబడెను. పరిశుద్ధాత్ముడు సత్యస్వరూపియైన ఆత్మయని చెప్పబడెను. అందుకే "మీరు సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని" యేసు చెప్పెను (యోహాను 8:31). సత్యమును విశ్వసించి దానికి లోబడని వాడెవడును యేసుద్వారా స్వతంత్రుడు కాజాలడు.

యేసు నేనే జీవమును అని చెప్పెను. జీవమును గూర్చి కూడ బైబిలు ఎక్కువ బోధించుచున్నది. "ఆయనలో జీవముండెను; ఆ జీవము మనుష్యులకు వెలుగై యుండెను" అని యోహాను 1:4లో వ్రాయబడి యున్నది. నిత్యజీవమునకు నడిపించునట్టి జీవము యేసుక్రీస్తులో యున్నది. "ఆత్మయే జీవింపచేయుచున్నది; శరీరము కేవలము నిష్ ప్రయోజనము. నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి" అని యేసు యోహాను 6:63లో పలికెను.

యేసు యొక్క మాటలు ఆత్మీయ జీవమును కలుగజేయును. పాపములలోబడి చచ్చిన వానిని ఆయన సువార్త ఒక్కటి మాత్రమే జీవింపజేయును. యేసును వెంబడించిన శిష్యులలో అనేకులు ఆయనను విడిచిపెట్టి వెళ్ళిపోగా, యేసు మీరు కూడ వెళ్ళిపోవలెనని యున్నారా? అని పండ్రెండు మందిని అడుగగా, సీమోను పేతురు – ప్రభువా యెవని యొద్దకు వెళ్ళుదుము? నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు అని ఒప్పుకొనెను (యోహాను 6:66-69). యోహాను 5:28,29లో యేసు ఇట్లనెను: "ఒక కాలము వచ్చుచున్నది; ఆకాలమున సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు." పాపములో మరణించిన వాడు లేపబడవలెనన్న దేవుని కుమారుని సజీవ సువార్తను విని, విశ్వసించి దానికి లోబడవలెను.

క్రీస్తు సువార్త పాపులను రక్షించుటకు దేవుని శక్తియై యున్నది. అందువలననే, "మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును" అని యేసు తన శిష్యులకాజ్ఞాపించెను (మార్కు 16:15,16).

యేసు యొక్క శిష్యులు లోకమందంతట సువార్తను ప్రకటించిరి ప్రజలు యేసునందు విశ్వసించవలెనని, తమ పాపముల విషయమై మారుమనస్సు పొందవలెనని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని బోధించిరి. అనేకులు సువార్తకు లోబడి క్రైస్తవులయిరి.

నీవు సత్యమూర్తియైన యేసును నమ్ముకొనుము, ఆయన మార్గమైన సంఘములో ఆయనను సేవించుము. ఆయన యిచ్చు నిత్యజీవములో ప్రవేశించుము.

# యేసుక్రీస్తు యొక్క దైవత్వము

**The Deity of Jesus Christ** (కొలస్స 2:8-10)

**పరిచయము :**

యేసుక్రీస్తు దేవుడై యున్నారు. ఆయన దేవునియొక్క తత్వమును లక్షణములను కలిగియున్నారు. గనుక ఆయన దేవుడు.

1. ప్రతివారు నేడు బైబిలు ముఖ్యమని భావిస్తారు. అది దేవుని సర్వసంపూర్ణ బయల్పాటు; దోషరహిత వాక్యము. అందువలన క్రైస్తవుడు మర్త్యతకును అమర్త్యతకును దైవత్వముకును మానవత్వముకును తల వ్యత్యాసమును తెలుసుకొనగలడు. యేసుక్రీస్తు యొక్క దైవత్వమును నిరూపించుటకు బైబిలు ఇచ్చు సాక్ష్యము చాలును.

2. యేసు ప్రభువు యొక్క దైవత్వమును బహుశ అందరు ఒప్పుకొంటారు. గనుక ఈ అంశమును ధ్యానించుట వలన యేసు ప్రభువు నందు విశ్వానముంచు వారు బలపరచబడుదురు. కొన్ని మతముల వారు క్రీస్తు యొక్క దైవత్వమును నిరాకరించుదురు. (యెహోవా సాక్షులు, ముస్లిములు, బౌద్ధులు మొ॥లగువారు).

3. ఒక్కొక్కసారి కొన్ని పదజాలముల వలన ప్రజలు గజిబిజి యగుదురు.

దేవుడు, దైవత్వము అనుపదములు సరిసమానములు. దైవత్వములోని ముగ్గురు మూర్తులలో యేసుక్రీస్తు ఒకరు. అందువలన తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు పరిశుద్ధాత్మ దేవుడు అని సంబోధిస్తాము (మత్తయి 28:18-20; 3:16-17; ఎఫెసీ 4:4-6). గనుక బైబిలులో కనబడని త్రిత్వము అనుపదము బైబిలు వ్యతిరేకమైనది కాదు. అది దైవత్వములోని ముగ్గురు వ్యక్తులను సూచించుటకు సాధారణంగా వాడబడుచున్న పదము.

**I. మెస్సీయను గూర్చిన ప్రవచనములు వాటి నెరవేర్పు యేసు దేవుడని నిరూపించుచున్నవి :**

దావీదు సంతతిలో నుండి బలవంతుడగు దేవుడుద్భవించునని ప్రవచింపబడినది (యెషయా 9:6-7).

అవి నెరవేర్చబడినట్లు సువార్తలలోని రికార్డు మనకు ధృవీకరించుచున్నది. ఆ ప్రవచనములన్నియు నజరేయుడైన యేసులో నెరవేరెను (మత్తయి 1:23; లూకా 1:31-33).

అది నెరవేరక 700 సంవత్సరాల ముందు యెషయా ప్రవచించెను.

II. యేసు శరీరధారుడు కాక ముందున్న జీవితం యేసు దేవుడని నిరూపించుచున్నది.

అబ్రాహాముకు ముందునుండే ఆయన యున్నట్లు యేసు తన్ను గూర్చి చెప్పుకొనెను (యోహాను 8:58).

యేసు సృష్టి జరుగక ముందు నుండి యుండెను మరియు సృష్టినంతటిని తన మాటచేత నేటికిని నిర్వహించుచున్నారు (కొలస్స 1:14-17; యోహాను 1:1-3,14; ఆదికా 1:26).

దేవునిచే ఏర్పాటు చేయబడిన సమయమందు దేవునిలో రెండవ వ్యక్తియైన యేసు మానవావతారియై ఈ లోకమునకు వచ్చెను (గలతీ 4:4).

III. తాను దేవుడునని యేసు చెప్పుకొనెను:

తాను దేవుడునని యేసుక్రీస్తు పలుసందర్భాలలో చెప్పుకొన్నారు.

1. మొదటి శతాబ్దపు యూదా మతనాయకులు ఆయన తన్ను దేవునితో సమానునిగా చేసికొను చున్నాడని భావించిరి (యోహాను 5:17-18).

2. తాను దేవుడునని యేసు సమరయ స్త్రీతో విపులముగా చెప్పుకొనెను (యోహాను 4:24-26).

3. అదే రీతిగా యేసు యూదుల సమాజమందిరపు అధికారుల యెదుట తాను దేవుని కుమారుడనని, గనుక దేవుడనని చెప్పుకొనెను (మార్కు 14:61-62).

బి. యేసు దేవుని మంచి ప్రవక్తయై యుండియు, దేవునికుమారుడుగా ఉండకుండ యుండలేరు.

1. యేసుదేవుని కుమారుడు కనుక దేవుడనని తన్ను గూర్చి చెప్పుకొనెను.

2. గనుక ఆయన తన్ను గూర్చి చెప్పుకొనినదేదో సత్యమైయుండాలి లేదా ఆయన మోసగాడై యుండాలి.

**యితరులిచ్చిన సాక్ష్యములు యేసు దేవుడని నిరూపించుచున్నవి :**

1. యేసు యొక్క శత్రువులు ఆయన దేవుడని ఒప్పుకొన్నారు. యేసు యొక్క శత్రువుల సాక్ష్యము బలమైనది.

2. యేసును అప్పగించిన యూదా ఆయన నిర్దోషియని ఒప్పుకొనెను (మత్తయి 27:3-5).

పిలాతు ఆయన యందు ఏ దోషమును కనుగొనలేకపోయెను (యోహాను 18:33-38).

3. సిలువ యొద్ద కాపలాయున్న శతాధిపతి ఆయన దేవుని కుమారుడని

ఒప్పుకొనెను (మత్తయి 27:54).

4. నజరేయుడైన యేసు దేవుని కుమారుడని దయ్యములు సయితము ఒప్పుకొనెను (లూకా 4:34).

**యేసు యొక్క మిత్రులు సయితము ఆయన దేవుడేని ఒప్పుకొన్నారు.**

1. నజరేయుడైన యేసు దేవుడని బాప్తిస్మమిచ్చు యోహాను ఒప్పుకొనెను (యోహాను 1:29,34).

2. అపొ.యోహాను తాను దేవుడునని యేసు చెప్పుకొనిన మాటలను వ్రాసెను(ప్రక 1:8).

3. యేసే క్రీస్తని, దేవుడని అపొ.పేతురు ఉద్ఘాటించెను (మత్తయి 16:16).

4. అపొ.తోమా యేసును నాదేవా, నా ప్రభువా అనిపిలిచెను (యోహాను 20:28).

5. దమస్కుమార్గములో అపొ. పౌలు యేసు దేవుడని ఉద్ఘాటించెను. (అపొ.కా 22:6-10). తరువాత కూడ ఆయన దేవుడని ప్రకటించెను. (ఫిలిప్పీ 2:5-11).

6. యేసేక్రీస్తని గనుక దేవుడని దేవదూతలు ప్రకటించిరి (లూకా 2:10-11).

7. తండ్రియైన దేవుడు యేసుదేవుని కుమారుడని ప్రకటించెను (మత్తయి 3:17;17:5).

8. ప్రవక్తయైన సుమెయోను యేసు దేవుడని ఒప్పుకొనెను (లూకా 2:25-32).

9. ప్రవక్త్రియైన హన్నా యేసు దేవుడని ప్రకటించెను (లూకా 2:36-38).

**పాత నిబంధనలో యెహోవా దేవుడు అనుపదము దైవత్వవములోని రెండవ వ్యక్తికి కూడ వర్తించును. అది యేసుకును వర్తించును.**

1. యెహోవా సృష్టి కర్త (యెషయా 40:28; యోహాను 1:3).

2. యెహోవా రక్షణ కర్త. యెషయా 43:11; యోహాను 4:42.

3. యెహోవా మృతులను లేపును 1 సమూ 2:6; యోహాను 5:21.

4. యెహోవా గొప్పన్యాయాధిపతి. యోవేలు 3: 11-12; యోహాను 5:27; మత్తయి 25:31-33.

5. యెహోవా నిత్య వెలుగై యున్నారు. యెషయా 60:19-20, యోహాను 8 :12

6. యెహోవా ఎల్లప్పుడు ఉన్నవాడైయున్నారు. నిర్గమ 3:14-15; యోహాను 8:58.

7. యెహోవా గొప్పకాపరి. కీర్తన 23:1; యోహాను 10:11.

8. యెహోవా మహిమయై యున్నారు. యెషయా 42:8; యోహాను 17:1,5

9. యెహోవా ఆదియు అంతమునై యున్నారు. యెషయా 41:4; 44:6; ప్రకటన 1:17, 2:80.

10. యెహోవా విమోచకుడు హోషేయ 13:4,14; గలతీ 4:5; ఎఫెసీ 1:7; తీతు 2:14.

11. యెహోవా పెండ్లికుమారుడు, యెషయా 62:3-5; హోషేయ 2:16-19, మత్తయి 25:1-13, ప్రక 21:2).

12. యెహోవా శైలము (బండయై) యున్నారు. కీర్తన 18:2; 1 కొరింధీ 10 : 4.

13. యెహోవా పాపములను క్షమించును. యిర్మియా 31:34; మార్కు 2:7,10.

14. యెహోవా దూతలచే ఆరాధింపబడెను. కీర్తన 148:1-2 హెబ్రీ 1:6

15. యెహోవా ఆకాశమందు నివసించును. మనుష్యులు ఆయనకు విజ్ఞాపన చేతురు. అపొ.కా. 7:59.

16. యెహోవా దూతలను సృజించెను. కీర్తన 148:2,5; కొలస్స 1:16.

17. యెహోవాను ప్రభువని ఒప్పుకొనవలెను. యెషయా 45:21-23; ఫిలిప్పీ 2:11.

**యేసు యొక్క పునరుత్థానము ఆయన దేవుడని నిరూపించుచున్నది.**

1. మృతులలో నుండి లేచిన వారిలో యేసు క్రీస్తు ప్రధముడు. గాని ఆఖరి వాడు కాదు.

1. సారెపతు విధవరాలి కుమారుడు చనిపోయినను మరల బ్రతికించబడెను. (1 రాజులు 17:22).

2. షూనేమీరాలు యొక్క కుమారుడు చనిపోయెను గాని మరల బ్రతికించబడెను (2 రాజలు 4:35).

3. ఎలీషా యొక్క శల్యము తగులగానే చనిపోయినవాడు తిరిగి లేచెను (2 రాజులు 13:2,3).

4. యాయీరు కుమార్తె మృతులలో నుండి తిరిగిలేపబడెను (మత్తయి 9:18-25; మార్కు 5:22-43).

5. నాయీను విధవరాలి కుమారుడు చనిపోయినను తిరిగి బ్రదికింపబడెను (లూకా 7:11-15).

6. చనిపోయి, సమాధిలో యుంచబడిన లాజరు మరల బ్రతికింపబడెను (యోహాను 11:44).

7, చనిపోయిన దొర్కాను అపొ. పేతురు తిరిగిలేపెను (అపొకా 9:36-41).

అయితే వీరందరు మరల చనిపోయి సమాధిని చేరుకొనిరి. యేసుక్రీస్తు మృతుల లోనుండి తిరిగి లేచినను మరల ఎన్నటికి చనిపోలేదు.

మరెన్నటికిని చనిపోవక యుండటకు లేవబడిన వారిలో యేసుక్రీస్తు ప్రధముడు (1 కొరింధీ 15:20,23).

తన స్వకీయ మరణమును గూర్చి యేసుక్రీస్తు ముందుగనే ప్రవచించారు (మత్తయి 16:21; మార్కు 7:8).

యేసు యొక్క పునరుత్థానమును దూతలు ప్రకటించిరి (మత్తయి 28:1-6; మార్కు 16:1-7; లూకా 24:1-9; యోహాను 20:12).

పునరుత్థానుడైన యేసును వందలాది మంది చూచిరి (అపొ.కా. 3:14-15).

మగ్దలేనే మరియ - యోహాను 20:1-18; మార్కు 16:9. మరియ అనే వేరొక శిష్యురాలు, మత్త 28:9-10. ఇద్దరు శిష్యులు లూకా 24:13-31. అపొ. పేతురు. లూకా 24:34.

తోమా తప్ప మిగతా పదిమంది అపొస్తలులు (యోహాను 20:19-24).

తోమా మరియు కొందరు శిష్యులు. యోహాను 20:26-28.

500 మందికంటే ఎక్కువ సహోదరులు. 1 కొరింధీ 15:6

అపొ.పౌలు 1 కొరింధీ 15:8; అపొ.కా. 9:3-8; 22:6-11

పునరుత్థానుడైన మన ప్రభువైన యేసు పరమందు తండ్రియొక్క కుడి పార్శ్వమున ఆశీనుడైయున్నారు. ఎఫెసీ 1:20.

**VII. యేసు కన్య గర్భమున జన్మించుట ఆయన దేవుడని నిర్ధారించుచున్నది.**

ఎ. కన్యక జనన మిచ్చునని ప్రవచింపబడెను. యెషయా 7:14.

బి. కన్య గర్భమున జన్మించునని చెప్పబడిన ప్రవచనము నజరేయురైన యేసులో నెరవేరెను. మత్తయి 1:23.

సి. దేవునికి అనుకూలమగు సమయమందు కన్యగర్భమున జన్మించుట సంకల్పించబడెను. గలతీ 4:4.

**VIII. యేసుయొక్క పరిపూర్ణ**

**పాపరహిత జీవితం ఆయన దేవుడని నిరూపించుచున్నది.**

ఎ. యేసు ఏ పాపము చేయలేదు హెబ్రీ 4:15; 1 పేతురు 2:22.

బి. ఆయన నిరపరాధియని ప్రభువు యొక్క శత్రువులు సయితము ఒప్పుకొన్నారు. లూకా 23:4.

**IX. తండ్రితో ఏకత్వము కలిగియుండుట ఆయన దైవత్వమును రూఢి పరచుచున్నది.**

ఎ. తండ్రి , కుమారుడు, పరిశుద్ధాత్ముడు దైవత్వములోని వ్యక్తులు. మత్తయి 28:18-20.

బి. తండ్రి, కుమారులు ఏకమైయున్నారు. యోహాను 10:30; 14:9; 17:21.

**X. ప్రకృతికతీతమైన క్రీస్తు జ్ఞానము ఆయన దైవత్వమును నిరూపించుచున్నది.**

ఎ. యేసు యొక్క జ్ఞానము ప్రకృతికతీతమైనది. యోహాను 14:47-49; 2:24-25; 4:28-21.

బి. యితరులు కూడ దేవుడు వారికిచ్చుట వలన అట్టి జ్ఞానము కలిగి యుండిరి. దానిని దేవుడే వారికిచ్చెను. అపో.కా.9:10-17; 21:10-11.

సి. ప్రకృతి కతీతమైన జ్ఞానము కలిగియుండి తాను దేవుడునని వక్కాణించుట వలన క్రీస్తు యొక్క దైవత్వము రూఢిపరచబడియున్నది.

**XI. యేసు చేసిన అద్భుతములు ఆయన దేవుడని నిరూపించుచున్నవి.**

ఎ. యేసు అనేక అద్భుతములు చేసెను. యోహాను 3:2; 5:36.

బి. అద్భుతాలు చేసే శక్తి యితరులకు కూడ ఇయ్యబడెను. అపో.కా. 2:4; 3 : 4-8.

సి. అద్భుతశక్తిని కలిగి యుండి తాను దేవుడునని వక్కాణించుకొనుట వలన యేసు యొక్క దైవత్వము నిరూపణయగుచున్నది. యోహాను 20:30-31.

**ముగింపు**

యేసుదేవుడని బైబిలు పదేపదే వక్కాణించుచున్నది

మానవావతారియైన యేసుక్రీస్తు దేవుడైయుండియు ఈ పుడముపై సంచరించి, మన కొరకు చనిపోయి, సమాధి చేయబడి మృతులలో నుండి తిరిగిలేచారు.

ఆయన తనకు విధేయులైన వారందరకీ రక్షకుడు. హెబ్రీ 5:8-9

ఆయనను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. మార్కు 16:16.

**- లూయిస్ రష్మోర్**

# హేబెలు మృతినొందియు మాటలాడుచున్నాడు.

**(Abel Being Dead, Yet Speaketh)**

మన మొదటి తల్లిదండ్రులు ఆదాము హవ్వల ప్రథమ కుమారుడు కయీను. హేబెలు వారి రెండవ కుమారుడు. హెబ్రీ గంథ్రకర్త హేబెలును గూర్చి "విశ్వాసమును బట్టి హేబెలు కయీను కంటే శ్రేష్ఠమైన బలి దేవునికి అర్పించెను. దేవుడతని అర్పణలను గూర్చి సాక్ష్యమిచ్చినప్పుడు అతడు ఆ విశ్వాసమును బట్టి నీతిమంతుడని సాక్ష్యము పొందెను. అతడు మృతినొందియు ఆ విశ్వాసము ద్వారా మాటలాడుచున్నాడు" (హెబ్రీ 11:4) అని హేబెలును గూర్చి చెబుతున్నాడు. కయీను, హేబెలుల కథ మనం ఆదికాండము 4వ అధ్యాయంలో చదువుతాము.

"ఆదాము తన భార్యయైన హవ్వను కూడినపుడు ఆమె గర్భవతియై కయీనును కని - యెహోవా దయవలన నేనొక మనుష్యుని సంపాదించుకొన్నాననెను. తరువాత ఆమె అతని తమ్ముడగు హేబెలును కనెను. హేబెలు గొర్రెల కాపరి, కయీను భూమిని సేద్య పరచువాడు. కొంతకాలమైన తరువాత కయీను పొలము పంటలో కొంత యెహోవాకు అర్పణగా తెచ్చెను. హేబెలు కూడా తన మందలో తొలిచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును అతని యర్పణను లక్ష్యపెట్టెను. కయీనును అతని యర్పణను ఆయన లక్ష్యపెట్టలేదు. కాబట్టి కయీనుకు మిక్కిలి కోపము వచ్చి అతడు తన ముఖము చిన్నబుచ్చుకొనగా - యెహోవా కయీనుతో - నీకు కోపమేల? ముఖము చిన్నబుచ్చుకొని యున్నావేమి? నీవు సత్క్రియ చేసిన యెడల తలనెత్తుకొనవా? సత్క్రియ చేయని యెడల వాకిట పాపము పొంచియుండును. నీయెడల దానికి వాంఛ కలుగును నీవు దానిని ఏలుదువనెను. కయీను తన తమ్ముడైన హేబెలుతో మాటలాడెను. వారు పొలములో ఉన్నప్పుడు కయీను తన తమ్ముడైన హేబెలు మీద పడి అతని చంపెను." (ఆది 4:1-8).

ప్రభువైన దేవుడు హేబెలు అర్పణను ఎందుకు లక్ష్యపెట్టెను? కయీను అర్పణను ఎందుకు తిరస్కరించెను? యెహోవాను సమాధానమిస్తున్నాడు. "మనము

కయీను వంటి వారమై యుండరాదు. వాడు దుష్టుని సంబంధియై తన సహోదరుని చంపెను. వాడతనిని ఎందుకు చంపెను? తన క్రియలు చెడ్డవియు తన సహోదరుని క్రియలు నీతి గలవియునై యుండెను గనుకనే గదా! (1యోహాను 3 : 12). ప్రభువైన దేవుడు హేబెలు జీవితమును అతని అర్పణను అంగీకరించెను. ఎందుకనగా అతడు ఆయన దృష్టిలో నీతిమంతుడు. ఆయన వాక్యమును బట్టి మనము నడుచుకొనుచున్న యెడల మనము కూడా ఆయన దృష్టిలో అంగీకరింప బడుదుము.

"నా నోటి మాటలును నా హృదయ ధ్యానమును నీ దృష్టికి అంగీకారములగును గాక" (కీర్త 19:14). మన నోటిమాటలు, మన తలంపులు, మన జీవన విధానము ఆయన దృష్టికి అంగీకారంగా ఉండును గాక. హేబెలు మృతిచెందెనుగాని దేవుడికి అంగీకారంగా ఉండే జీవన విధానం మనం కలిగి ఉండాలని అతడు మనతో మాట్లాడుతున్నాడు.

రెండవదిగా, యెహోవా కయీనుతో-నీకు కోపమేల? ముఖము చిన్నబుచ్చుకొని యున్నావేమి? నీవు సత్క్రియచేసిన యెడల తలనెత్తుకొనవా? సత్క్రియ చేయని యెడల వాకిట పాపము పొంచియుండును; నీ యెడల దానికి వాంఛ కలుగును నీవు దానిని ఏలుదువనెను" (ఆది 4:6). హేబెలు జీవితము దేవుని యెదుట మంచిగా ఉంది. ఆతని జీవితము మంచి పనులతో నిండివుంది. "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోక మందున్న మీ తండ్రిని మహిమ పరచునట్లు వారియెదుట మీ వెలుగు ప్రకాశింప నియ్యుడి" (మత్తయి 5:16) అని అంటున్నారు యేసు ప్రభువు. పౌలు రోమాలోని క్రైస్తవులతో అంటున్నాడు "సత్క్రియను ఓపికగా చేయుచు, మహిమను ఘనతను అక్షయతను వెదకు వారికి నిత్య జీవము నిచ్చును" (రోమా 2:7).

"మనము మేలు చేయుట యందు విసుగక యుందము. మనము అలయక మేలు చేసితిమేని తగిన కాలమందు పంటకోతుము" (గలతి 6:9).

"ఎవడును కీడునకు ప్రతికీడు ఎవరికైనను చేయకుండ చూచుకొనుడి, మీరు ఒకని యెడల ఒకడును మనుష్యులందరి యెడలను ఎల్లప్పుడు మేలైన దానిని అనుసరించి నడుచుకొనుడి" (1 థెస్స 5:15). "సహోదరులారా! మీరైతే మేలు

చేయుటలో విసుక వద్దు" (2 థెస్స 3:13). "అధిపతులకును అధికారులకును లోబడి విధేయులుగా ఉండవలెననియు, ప్రతి సత్కార్యము చేయుటకు సిద్ధపడియుండవలెననియు, ఈ మాట నమ్మదగినది గనుక దేవుని యందు విశ్వాసముంచినవారు సత్క్రియలను శ్రద్ధగా చేయవలెను. ఇవి మంచివియు మనుష్యులకు ప్రయోజన కరములునై యున్నవి. మన వారును నిష్ఫలులు కాకుండు నిమిత్తము అవసరమునుబట్టి సమయోచితముగా సత్క్రియలను శ్రద్ధగా చేయుటకు నేర్చుకొనవలెను. (తీతు 3:1, 8,14) "ఉపకారమును, ధర్మమును చేయ మరచిపోకుడి, అట్టి యాగములు దేవుని కిష్టమైనవి" (హెబ్రీ 13:16).

మూడవదిగా, హేబెలు మృతి చెందినప్పటికి దేవునికి శ్రేష్టమైనవి ఇవ్వాలని మనతో మాట్లాడుతున్నాడు. "శ్రేష్టమైన ప్రతి యీవియు, సంపూర్ణమైన ప్రతి వరమును పరసంబంధమైనదై జ్యోతిర్మయుడగు తండ్రి యొద్దనుండి వచ్చును. ఆయన యందు ఏ చంచలత్వమైనను గమనా గమనముల వలన కలుగు ఏ ఛాయయైనను లేదు". (యాకోబు 1:17). అన్ని దీవెనలు మనము ఆయన నుండి పొందుతున్నాము. "ఎందుకనగా నీకు ఆధిక్యము కలుగజేయువాడెవడు? నీకు కలిగిన వాటిలో పరుని వలన నీవు పొందనిది ఏది? పొంది యుండియు పొందనట్టు నీవు అతిశయింపనేల?" (1 కొరిం 4:7). ఆయన మన సృష్టికర్త, మన తండ్రి, మన అవుసరతలన్నీ ఆయన సమకూరుస్తారు. ఆయన ఆకాశమునుండి వర్షమును, ఫలభరితమైన ఋతువులను ఇచ్చి మేలుతో మనలను తృప్తి పరచుచున్నారు (అపో. 14:17). ఆయన నుండి మనకు సహాయం వస్తుంది. ఆయన మన దేవుడు. దానికి ప్రతిగా మనము ఆయనకు ఏమి ఇవ్వగలము? సర్వశక్తిగల దేవుడు అంటున్నారు: "నీ యింటనుండి కోడెనైనను, నీ మందలోనుండి పొట్టేలైనను నేను తీసికొనను. అడవి మృగములన్నియు, వేయి కొండలమీది పశువులన్నియు నావేగదా. కొండలలోని పక్షులన్నిటిని నేనెరుగుదును. పొలములోని పశ్వాదులు నా వశమై యున్నవి. లోకమును దాని సంపూర్ణతయు నావే. నేను ఆకలిగొనినను నీతో చెప్పను" (కీర్తన 50:9-12)

మనము అన్ని మేలులను దేవుని

నుండి పొందుతాము. తిరిగి ఆయనకు ఏమి ఇవ్వగలము? మన పాప ప్రాయశ్చిత్తంగా ఆయన తన కుమారుడు యేసుక్రీస్తు ప్రభువును ఈ లోకమునకు పంపారు. తన మందలో శ్రేష్ఠమైన దానిని హేబెలు అర్పించాడు. తన వాగ్దాన పుత్రుని ప్రభునకు ఇయ్యడానికి అబ్రహాము వెనుదీయ లేదు (ఆది 22). హన్నా తన మొదటి కుమారుడు సమూయేలును దేవుని సేవకు ఇచ్చింది. దావీదు, సొలొమోను తన కున్నవాటిలో శ్రేష్ఠమైనవి దేవునికి ఇచ్చారు. హేబెలు మరణించాడు. మరణించినా గాని మనము దేవునికి శ్రేష్ఠమైనవి ఇవ్వాలని మనతో మాట్లాడుతున్నాడు.

హేబెలు మరణించినప్పటికి దేవునికి మనము మొదటి స్థానం ఇవ్వాలని మనతో మాట్లాడుతున్నాడు. హేబెలు తనమందలో 'తొలిచూలు' వాటిని దేవునికి ఇచ్చాడు. మనదేవుడైన ప్రభువు మన జీవితంలో మొదటి స్థానం కోరుతున్నారు. ఇశ్రాయేలుకు ఆయన ఇచ్చిన మొదటి ఆజ్ఞ "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు" (నిర్గమ 20:3). ఓడ నుండి బయటకు వచ్చిన తరువాత నోవహు మొదటిగా చేసినది "యెహోవాకు బలిపీఠము కట్టి పవిత్ర పశువులన్నిటిలోను పవిత్ర పక్షులన్నిటి లోను కొన్ని తీసికొని ఆ పీఠము మీద దహన బలి అర్పించెను (ఆది 8 : 20). మన పితరులు, విశ్వాసవీరులునైన అబ్రహాము, ఇస్సాకు, యాకోబులు ప్రభువుకు ప్రధమ స్థానమిచ్చారు.

ప్రభువైన యెహోవా ఇశ్రాయేలీయులు తమ పంటలోని ప్రధమ పంటను ఆయనకు ఇవ్వాలని వారికి ఆజ్ఞాపించారు (లేవి 23:10). "మనుష్యులలోను, పశువుల లోను ఇశ్రాయేలీయులలో తొలిచూలియైనది యావత్తును నాది. ఐగుప్తుదేశములో తొలిచూలియైన ప్రతివానిని నేను సంహరించిన నాడు వారిని నాకొరకు ప్రతిష్ఠించుకొంటిని. ఇశ్రాయేలీయులలో తొలిచూలియైన ప్రతివానికి మారుగా లేవీయులను తీసికొని యున్నాను" (సంఖ్యా 8:17,18).

కొండమీది ప్రసంగంలో మన దేవుడైన యెహోవా, మన రక్షకుడైన ప్రభువు "మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి, అప్పుడు అవన్నియు మీకనుగ్రహింప బడును" అన్నారు (మత్తయి 6:33). మనము సంఘముయొక్క క్షేమాభివృద్ధి కొరకు ఆయన రాజ్య విస్తరణకొరకు ప్రయాసపడాలి. దేవుని చిత్తము

చేయడమే యేసు ప్రభువు యొక్క గురి ప్రథమ కర్తవ్యం కూడా. "ఇతర సమీప గ్రామములలోనూ నేను ప్రకటించునట్లు వెళ్ళుదము. రండి. ఇందు నిమిత్తమే గదా నేను బయలు దేరి వచ్చితినని వారితో చెప్పెను (మార్కు 1:39). "నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటయు, ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమైయున్నది" (యోహా 4:34). యేసుప్రభువు తనను వెంబడించమని ఆయన శిష్యులను పిలిచినపుడు వారు తమ వృత్తిని తల్లిదండ్రులను విడిచి ఆయనను వెంబడించారు. మనము ఇద్దరు యజమానులకు దాసులుగా వుండలేము. మన హృదయంలో, జీవితంలో దేవునికి లోకానికి ఒకేసారి ప్రధమస్థానం ఇయ్యలేము. మనం దేవునికి మన జీవితంలో ప్రధమస్థానం ఇయ్యాలని ఆయన ఆశ. రెండవ స్థానం ఆయన అంగీకరించరు. మరియ ఆయన పాదముల యొద్ద కూర్చొని దేవుని మాటలు వినడానికి ప్రాధాన్యతనిచ్చింది గనుక యేసుప్రభువు ఆమెను అభినందించారు (లూకా 10:38-42).

హేబెలు మరణించినప్పటికి మనం మన జీవితంలో, మన రాబడిలో, మన సమయంలో దేవునికి మొదటిస్థానం ఇవ్వాలని మనతో మాట్లాడుతున్నాడు. ఆయన ప్రథముడుగా ఉండడం ఆయనకు ఇష్టం. మనం ప్రతిదినం ప్రార్ధనతో ప్రారంభిద్దాం. ఆరాధన కార్యక్రమాలకు హాజరు కాలేనంత పనులభారంతో మనం ఉండవద్దు. అలా చేస్తున్నట్లయితే మనం యేసుప్రభువునకు ఆయన రాజ్య విస్తరణకు మొదటిస్థానం ఇవ్వడం లేదనమాట. ప్రతిరోజు కుటుంబ ప్రార్థనలో పాల్గొనకపోతే మనం మన జీవితంలో దేవునికి ప్రధమ స్థానం ఇయ్యడం లేదు. నీ జీవితంలో, నీ హృదయంలో నీవు ఎవరికి మొదటి స్థానం ఇస్తున్నావు? హేబెలు మరణించినాగాని మనం దేవునికి మొదటిస్థానం ఇవ్వాలని మాట్లాడు తున్నాడు.

మరణించినాగాని మంచి చేయుటకు హేబెలు మనతో మాట్లాడుతున్నాడు. శ్రేష్టమైనవి ఆయనకిచ్చుట ద్వారా మన జీవితంలో, రాబడిలో, మన సమయంలో, సర్వశక్తుడైన దేవునికి ప్రధమ స్థానం ఇచ్చుట ద్వారా మన ప్రతి దినచర్యలో ఆయనను ఘనపరచవలెనని హేబెలు మరణించినాగాని మనతో మాట్లాడుతున్నాడు. అతడు చెప్పినది నీవు వింటున్నావా? - **కవితా గూటం**

# యేసు ప్రభువు చేయని అద్భుతములు

## (Miracles Jesus did not perform)

యేసు జీవిత చరిత్రను తెలియజేయు నాలుగు సువార్తలు ఆయన చేసిన 37 ప్రత్యేక అద్భుతములను గూర్చి తెలియజేస్తాయి. ఆయన మన మధ్య పరిచర్య చేసిన కాలములో కొన్ని రొట్టె ముక్కలతో వేల కొలది జనులకు ఆహారము పెట్టారు. తుఫానును గద్దించి నిమ్మళింప జేసారు. నీళ్లపై నడిచారు. ఆయన కుంటి వారిని, గ్రుడ్డివారిని, చెవిటి వారిని బాగు చేసారు. చనిపోయిన వారిని సయితము లేపారు.

యేసు చేసిన అద్భుతములను పఠించి ధ్యానించుట ద్వారా మనం ఎంతో నేర్చుకొనగలము. అయితే యేసు చేయని కొన్ని అద్భుతములను గూర్చి ఇప్పుడు పరీక్షించుదము. ఫలాని అద్భుతము చేయవలెనని కొందరు ఆయనను కోరగా అట్లు చేయుటకు ఆయన నిరాకరించారు.

అరణ్యములో ఆయన ఉపవాస ముండిన తరువాత యేసు సాతానుచే శోధింపబడ్డారు. అపవాది ఆయనతో "నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపింపుమని" చెప్పాడు. అట్లు చేస్తే ఆయన శక్తిని దుర్వినియోగం చేసినట్లుయగును కనుక "మనుష్యుడు రొట్టెవలన మాత్రము జీవింపడుగాని దేవుని నోట నుండి వచ్చు ప్రతిమాట వలన జీవించును అని వ్రాయబడియున్నదని" చెప్పి ఆయన వానిని నిరాకరించారు (మత్తయి 4:3-4).

సమరయులో ఒక గ్రామము ఆయనను చేర్చుకొనలేదు. "ఆయన శిష్యులైన యాకోబును యోహానును అదిచూచి ప్రభువా ఆకాశము నుండి అగ్నిదిగి వీరిని నాశనము చేయునట్లు మేమాజ్ఞాపించుట నీకిష్టమా అని ఆయననడుగగా ఆయన వారితట్టు తిరిగి వారిని గద్దించెను" (లూకా 9:51-54). "మరియు మీరు యెట్టి ఆత్మ గలవారో మీరెరుగరు. మనుష్య కుమారుడు మనుష్యుల ఆత్మను రక్షించుటకే గాని నశింపజేయుటకు రాలేదనెను".

గెత్సెమనేలో యేసును బంధించుటకు జనసమూహములు రాగా యేసు పేతురుతో," ఈ సమయమున నేను తండ్రిని

వేడుకొనలేననియు వేడుకొనిన యెడల ఆయన పంద్రెండు సేనా వ్యూహముల కంటె ఎక్కువమంది దూతలను ఇప్పుడే నాకు పంపడనియు నీవనుకొను చున్నావా?" యని అడిగెను (మత్తయి 26:51-54). యేసు చేయని అద్భుతము ఇదొకటి.

ఆయనకు తీర్పు జరుగుచున్న సమయములో ఆయన అద్భుతములు చేయవలెనని ఆయన శత్రువులు ఆయనను రెచ్చగొట్ట ప్రయత్నించిరి గాని ఆయన వారి కోరిక మన్నించలేదు. వారి యొక్క దుష్టకోరికలను సంతృప్తిపరచుట కాయన శక్తి ఉద్దేశించబడలేదు (మత్తయి 26:67-68; లూకా 23:8-9).

చివరిగా ఆయన సిలువ మీద వ్రేలాడుచుండగా, "నీవు దేవుని కుమారుడవైతే సిలువ మీద నుండి దిగుమని" ఆయన శత్రువులు ఆయనను దూషించిరి (మత్తయి 27:40). ఆయన దేవుని కుమారుడే. ఆయనకు అట్టి శక్తి యున్నది. గాని ఇతరులు జీవించునట్లు ఆయన మరణించుటకు ఎంచుకొన్నారు.

క్రొత్త నిబంధనలో యేసు యొక్క అద్భుతములను స్టడీ చేస్తే ఆయన తన్ను గూర్చి చెప్పుకొన్నవి, అపొస్తలులు చెప్పినవి యధార్ధమని రుజువగును (యోహాను 20:30-31). ఆయన దేవుని కుమారుడని ఆయన క్రియలు సాక్ష్యమిచ్చుచున్నవి (హెబ్రీ 2:1-4). ఆయన చేయని అద్భుతములు కూడ ఆయన నిజముగా దయ గల దేవుని కుమారుడని రుజువు చేయుచున్నవి.

- రేండీవాన్

## ఒకటి (One)

దేవుడు మన జీవితములో మరియొక నూతన సంవత్సరమును అనుగ్రహించారు. ఇన్ని సంవత్సరాలు మనలను కాపాడి పోషించి సంరక్షించిన దేవునికి వందనములు చెల్లించాలి.

కాలేబు - "ఈ నలుబది ఐదు ఏండ్లు ఆయన నన్ను సజీవునిగా కాపాడి యున్నాడు" (యెహోషువా 14:10).

హనోకు 300 ఏండ్లు దేవునితో నడిచెను (ఆది 5:22) అనగా హనోకు దేవునితో సహవాసము చేసెను. గతించిన మన జీవితము చూచుకొంటే దేవునితో సహవాసము కలిగి యున్నామా? క్రీస్తు సంఘముతో

సహవాసము కలిగియున్నామా? ఈ సంవత్సరము నుండి ఆయనతో సహవానము కల్గియుండాలని నిర్ణయము తీసుకొందాము మన తప్పిదములను వాక్యమును బట్టి సరిచేసుకుందాము.

**1. నీకు ఒకటి కొదువగా యున్నది** (మార్కు 10:21).

ఒక యౌవనస్తుడు నిత్యజీవమును పొందుటకు ఏమిచేయాలని తెలిసుకొనుటకు వచ్చాడు. నిత్య జీవమును గూర్చి ఈ యౌవనస్తుని యొక్క అవగాహనను పరిశీలిస్తే :

**(ఎ) "నిత్య జీవమును పొందుటకు ఏ మంచికార్యము చేయాలి" అని ప్రభువును అడిగాడు** (మత్తయి 19:16).

మంచి పనులు, పుణ్యకార్యాల వలన పరలోకము పొందుకో గల మని ఇతని అభిప్రాయము. రక్షణను, నిత్యజీవమును గూర్చిన అవగాహనలో కొదువగా యున్నాడు.

"మీరు విశ్వాసము ద్వారా దేవుని కృపచే తనే రక్షింపబడి యున్నారు. ఇది మీ వలన కలిగినది కాదు. దేవుని వరమే అదిక్రియల వలన కలిగినది కాదు గనుక ఎవడును అతిశయపడ వీలులేదు" (ఎఫె 2:8,9).

**(బి) "బాల్యము నుండి నేను ఈ ఆజ్ఞలను గైకొనుచున్నాను"** (మార్కు 10:20) :- నేను ఏ తప్పు చేయలేదు నేను ఏ పాపము చేయలేదు నేను నీతిమంతుడను అనే అపోహ కాని దేవుని వాక్యము ఈలాగు చెప్పుచున్నది. "నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు" (రోమా 3:11).

"ఏ భేదమును లేదు అందరూ పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:23).

"ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలముగా ఏ మనుష్యుడును నీతిమంతుడుగా తీర్చబడడు (రోమా 3:20).

"కాబట్టి విశ్వాసము ద్వారానే మనము నీతిమంతులముగా తీర్చబడుచున్నామ (రోమా 3:24).

**సి. దేవుని ప్రేమించుట విషయములో కొదువగా యున్నాడు:-** "అతడు దేవునికంటే ధనమును ఎక్కువగా ప్రేమించుట వలన ప్రభువును వెంబడించుటకు ఇష్టపడ లేదు".(మార్కు 10:22).

మనము వేటిని ఎక్కువగా ప్రేమిస్తున్నాము? ధనమునా, వస్త్రములనా, విలువ గల వాటినా? లేక దేవునినా?

నీకు ఒకటి కొదువగా ఉన్నది అని ప్రభువు చెప్పుచున్నారు. అది ప్రార్థనా? వాక్యమును ధ్యానించుటా? సంఘ సహవాసమా? లేక ప్రభువును వెంబడించుటలోనా? పరీక్షించుకొనుము.

**2. మీ మధ్య శాపగ్రస్తమైనది ఒకటి కలదు:-**

యెహోషువా 7వ అధ్యాయంలో ఆకాను యొక్క జీవితమును గూర్చి చదువగలము. ఆకాను పాపము తనకు తన కుటుంబమునకు మరణం తెచ్చింది (యెహోషు 7:25). అంతేకాదు ఇశ్రాయేలీయులు హాయి పట్టణము పై ఓడిపోయారు (యెహోషు 7:5). దీనికంతటికి కారణం ఆకాను యొక్క పాపము. "మీ మధ్య శాపగ్రస్తమైనది ఒకటి కలదు మీరు దానిని మీ మధ్య నుండకుండా నిర్మూలము చేయువరకు మీ శత్రువుల ఎదుట మీరు నిలువ లేరు" (యెహోషు 7:13).

దేవుడు మనకు తోడుగా ఉండాలంటే మనమధ్య శాపగ్రస్తమైన పాపము (ద్వేషము,అసూయ, కోపము, వైానసము, అబద్ధము వెం॥వి) ఉండకూడదు.

**3. అవసరమైనది ఒక్కటే :-**

లూకా 10:41 అందుకు ప్రభువు - మార్తా, మార్తా, నీవనేకమైన పనులను గూర్చి విచారము కలిగి తొందర పడుచున్నావు గాని అవసరమైనది ఒక్కటే. మరియ ఉత్తమమైనది ఏర్పరచుకొనెను". మరియ అవసరమైనది ఉత్తమమైనది ఆమె యొద్ద నుండి తీసివేయబడనిది ఏర్పరచుకొన్నది. మరియ దేవుని పాదాలవద్ద కూర్చొని ఆయన మాటలు వినుచుండెను.

ప్రభువు కొరకు ఏమిచేసామో కాదు. ప్రభువుతో కలసి ఏమి చేస్తున్నామో అది ముఖ్యము. మార్త ప్రభువును తన ఇంటికి ఆహ్వానించింది గాని ప్రభువును విడిచిపెట్టింది. మార్త ప్రభువుకు ప్రాధాన్యము ఇవ్వడంలో విఫలమైనది.

ప్రభువుకు ప్రాధాన్యము ఇవ్వకపోతే కలుగు నష్టాలు

(1) విస్తారమైన పనులు (లూకా 10:40 వ) (2) తొందరపాటు (40వ). (3) ఒంటరి అనే భావము (40వ). (4) సంబంధాలలో బలహీనత (నా సహోదరినన్ను విడచి

-40వ) (5) నిస్సహాయము 41వ (6) దేవుని పై నేనిందవేయుట (చింతలేదా?) (7) విచారము (41వ).

**(4) ఒకటి చేయుచున్నాను:-** "అయితే ఒకటి చేయుచున్నాను వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటి కొరకై వేగిరపడుచున్నాను . క్రీస్తు యేసు నందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానము పొందవలెనని గురియొద్దకే పరుగెత్తుచున్నాను" (ఫిలిప్పి 3:13,14).

పౌలుకు తన ముందున్న గురి ఏదనగా నిత్యజీవము. ఈ లోక సంబంధమైన వాటిని పెంటతో సమానముగా ఎంచుకొన్నాడు. ఈ లోకమును లోకములో ఉన్న వాటినైనను ఆశించకూడదు. మన అపజయాలు మనలను నిరుత్సాహపరచి ముందుకు సాగకుండా చేస్తాయి. అలాగే గతంలోని మన విజయాలను చూచి గర్వించి అక్కడే నిలచి పోయేటట్లుగా చేస్తాయి. గాని ప్రభువులో మనము ముందుకు సాగిపోవాలి.

ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడచి వచ్చినను ఐగుప్తు జ్ఞాపకాలను విడువక నశించిపోయారు. వెనుకకు చూడకుండా పొమ్మని చెప్పినా లోతు భార్య వెనుదిరిగిచూచి ఉప్పుస్తంభముగా మారినది.

యోసేపు తన సహోదరులు చేసిన కీడంతటిని మరచి సహోదరులతో సమాధానముగా యుండి కరవులో వారిని ఆదుకున్నాడు. ఆయా వ్యక్తులను క్షమించే వారముగా యుండాలి. ప్రభువు జీవితమును ఒకసారి జ్ఞాపకము చేసుకుంటే "ప్రభువు తన ఎదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి సిలువను సహించి, దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్వమున ఆసీనుడై యున్నారు" (హెబ్రీ 12:2).

ప్రభువును ప్రేమించుటలో కొదువ కల్గియున్నామా? పరిశుద్ధముగా జీవించే విషయములో రాజీపడిపోయి క్రీస్తుతో సహవాసములో వెనుకబడి యున్నామా? ప్రార్థనయందు, వాక్యము చదువుట యందు, సంఘ కార్యక్రమములలో పాలి భాగస్థులుగా యుండుటలో వెనుకబడియున్నామా?

దేవుని కార్యాభివృద్ధి యందు ఎల్లప్పుడు ఆసక్తి కల్గియుండుటకు దేవుడు మనకు సహాయము చేయును గాక!

– బి.యస్.ఎ.సువార్త.

## సంక్షిప్త వార్తలు

2016 ఫిబ్రవరి 3వ తేదీ బుధవారం నాడు పశ్చిమగోదావరి జిల్లా, జంగారెడ్డిగూడెంలో సోదరులు నాగభూషణం గారి జ్యేష్ట కుమార్తె యొక్క వివాహ రిసెప్షన్ కార్యక్రమము ఘనముగా జరిగెను. క్రీస్తు సంఘముల అనేకమంది బోధకులు, ప్రముఖులు, సోదరసోదరీలు ఆ సంతోష కార్యక్రమములో పాలుపొంది నూతన వధూవరులను అభినందించిరి.

2016 ఫిబ్రవరి 4వ తేదీ గురువారం తూర్పుగోదావరి జిల్లా, పలివెలలో యున్న క్రీస్తు సంఘము తమ ఆలయ నిర్మాణ 4వ వార్షికోత్సవమును పురస్కరించుకొని స్తుతి కూటమును ఘనముగా నిర్వహించిరి. వందలాదిమంది హాజరయ్యారు. డెల్టాప్రాంతముల సువార్తికులు ఎక్కువమంది పాల్గొని కార్యక్రమము ఘనముగా నిర్వహించుటలో సహకరించిరి. సోదరులు పి.జె. కృపాలిని గారియొక్క నిర్విరామ, నిస్వార్ధ కృషి వలన పలివెలలోను, పరిసర ప్రాంతములలోను క్రీస్తు సంఘము సంఖ్యలోను ఆత్మీయముగను అభివృద్ధి జెందుచున్నది.

2016 ఫిబ్రవరి 10వ తేదీ బుధవారం సికింద్రాబాదు, యాప్రాల్‌లో యున్న క్రీస్తు సంఘము ఒక్కరోజు బైబిలు తరగతిని చక్కగా నిర్వహించిరి. సోదరులు మార్క్ రేనాల్డ్‌గారు చక్కటి వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘము చక్కటి భోజనములనేర్పాటు చేసిరి. యాప్రాల్‌లో సోదరులు లెమూయేల్‌గారు సంఘమును సమర్ధవంతముగా నడుపుచున్నారు.

2016 ఫిబ్రవరి 12వ తేదీనాడు కాకినాడ సత్యవాణి ఆవరణలో బోధకుల సహవాస కూడిక జరిగెను. సోదరులు వి. చిన్నయ్యగారు, మార్క్ రేనాల్డ్ గారు వాక్యపరిచర్య చేసిరి. రిక్కీ గూటంగారు, జాషువాగారు మార్క్‌గారి ఉపదేశములను తెలుగున కనువదించిరి. హాజరైన అనేకులు గొప్ప సహవాస మాధ్యురమునసుభవించి దేవుని స్తుతియించిరి. 12వ తేదీ సాయంత్రం మార్కుగారు రిక్కీ గారు ద్వారపూడిలో జరిగిన గొప్ప సువార్త కూటములో

వాక్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరులు తిమోతిపాల్‌గారు సువార్త చాటుచున్నారు.

2016 ఫిబ్రవరి 15, 16 తేదీలలో విజయనగరం జిల్లా సివరాం గ్రామములో జరిగిన బైబిలు క్లాసులలో సోదరులు మార్క్ రేనాల్డ్‌గారు, రిక్కీ గూటంగారు హాజరై చక్కటి వాక్యపరిచర్య చేసిరి. చీపురుపల్లి ప్రాంతములో పనిచేయుచున్న అనేకమంది సువార్తికులు హాజరై బైబిలు సత్యములను మరింత అవగాహన చేసుకొనగల్గిరి. ఆ ప్రాంతములో సోదరులు లూకాగారు, ఆయన కుమారులు తోమస్ గారు చాలకాలము నుండి దేవుని కొరకు గొప్ప పని చేయుచున్నారు.

2016 ఫిబ్రవరి 8వ తేదీనుండి సోదరి కవితా గూటంగారు అస్వస్థతకు గురియై ఒక వారము దినములు ఆసుపత్రిలో గడిపిరి. ఆ సోదరి యొక్క ఆరోగ్యము కొరకు చదువరులు ప్రార్థించ మనవి.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.